క్లుప్తంగా

అనుమతి లేని లేఅవుట్లలో ప్లాట్లు కొనొద్దు



అక్రమ లేఅవుట్‌లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

ఎన్‌పీకుంట: పంచాయతీ అనుమతులు లేని అక్రమ లేఅవుట్లలో ప్లాట్లను కొనుగోలు చేయరాదని పంచాయతీ కార్యదర్శులు రమేష్, ముబారక్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో అక్రమంగా ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో సర్పంచ్ ఆంజినమ్మ ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడ ప్లాట్లు కొనుగోలు చేసి నిర్మాణాలు చేపడితే ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేయడానికి పంచాయతీకి అధికారం ఉందన్నారు. నీటి, విద్యుత్ సరఫరా, రోడ్లు, డ్రైనేజీ సౌకర్యం కల్పించమని తెలిపారు.

నామినేషన్ దాఖలు



నామినేషన్ పత్రాన్ని అందజేస్తున్న లక్ష్మీనారాయణమ్మ

బత్తలపల్లి: మండలంలోని తంబాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని 3వ వార్డు పదవికి బుధవారం లక్ష్మీనారాయణమ్మ నామినేషన్ దాఖలు చేశారు. బత్తలపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె సర్పంచు సానే జయచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, ఉప సర్పంచు బీదాల ప్రతాప్‌రెడ్డితో కలిసి వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. తన నామినేషన్ పత్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి దివాకర్‌కు అందజేశారు. ఈ స్థానంలో రాములమ్మ ఉండగా ఆమె అనారోగ్యంతో మృతి చెందడంతో ఎన్నిక నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో సూరీ, లింగమయ్య, చరణ్‌కుమార్‌రెడ్డి, సంద్రా రామకృష్ణ, బండి నాగభూషణ, ముసలప్ప, సూరీ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్‌కు నేడు ఆఖరు

గాండ్లపెంట: మండల పరిధిలోని మలమీదపల్లి పంచాయతీ బనాన్‌చెరువుపల్లి 9వ వార్డు సభ్యులుగా (ఎస్టీ మహిళ) నామినేషన్ వేసేందుకు గురువారం చివరి తేదీ అని ఎన్నికల అధికారిణి, ఈఓఆర్డీ సునీత తెలిపారు. ఆశావహులు త్వరపడాలని సూచించారు.

'ఆడుదాం ఆంధ్రా' విజయవంతం చేద్దాం



ఉపాధ్యాయులతో చర్చిస్తున్న ఎంపీడీఓ ఆదినారాయణ

ఎన్‌పీకుంట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'ఆడుదాం ఆంధ్రా' పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఆదినారాయణ, తహసీల్దార్ నరేంద్రకుమార్ పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు శిరిషారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అక్టోబరు 2 నుంచి పోటీలు ప్రారంభం అవుతాయని, 17 సంవత్సరాలు పైబడి ఆసక్తి కలిగిన యువతీ యువకులు ఈ నెల 14వ తేదీ నుంచి ఆయా సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు ఉన్నాయని తెలిపారు. క్రీడా సామగ్రి ప్రభుత్వమే అందిస్తుందని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ అంజినమ్మ, పాఠశాల పీడీ సందీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా ఉట్ల పరుష



ముదిగుబ్బ: జొన్నలకొత్తపల్లి గ్రామంలో బుధవారం ఉట్లమాను పరుషను ఉల్లాసంగా..ఉత్సాహంగా జరుపుకున్నారు. ఉట్లమాను ఎక్కడానికి యువకులు పోటీ పడ్డారు. తిలకించడానికి గ్రామస్థులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

టీచర్‌కు సన్మానం

నల్లమాడ: సానేవారిపల్లి ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తూ బదిలీ అయిన ఉపాధ్యాయురాలు ఫర్హానాకు బుధవారం సానేవారిపల్లి పాఠశాల ఆవరణలో పౌర సన్మానం నిర్వహించారు. ఎంఈఓలు వేమనారాయణ, సురేష్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సానేవారిపల్లి గ్రామస్తులు ఉన్నారు.

ఘనంగా నా భూమి.. నా దేశం



తాడిమర్రి: మొక్క నాటుతున్న డీసీఎంఎస్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి



నల్లమాడ: జెండాకు వందనం చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



ఎన్‌పీ కుంటలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

- మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు

నల్లమాడ: మండలంలోని రెడ్డిపల్లి, పాతబత్తలపల్లి, పెమనకుంటపల్లి తండాలో బుధవారం నాభూమి.. నాదేశం కార్యక్రమాన్ని అధికారులు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ దుంగావత్ సునీతాబాయి, వైస్ ఎంపీపీ కే.సూర్యనారాయణ, సహకార సంఘం అధ్యక్షులు ఏ.గంగిరెడ్డి, తహసీల్దార్ దేవేంద్రనాయక్, ఎంపీడీఓ కొండన్న పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు. అనంతరం అమరవీరుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. 'వసుధకు వందనం'లో భాగంగా మొక్కలు నాటారు. సర్పంచ్‌లు ప్రసాద్, మాసే రెడ్డెమ్మ, ఆనంద్‌నాయక్, రెడ్డిపల్లి ఉప సర్పంచ్ గంగిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధులకు నివాళి

కనగానపల్లి: కనగానపల్లి, మామిళ్లపల్లి, ముత్తువకుంట్ల, ముక్తాపురంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం నా భూమి– నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో కలసి అధికారులు, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటారు. స్వాతంత్య్ర సమరయోధులకు నివాళులర్పించారు. తహసీల్దార్ రమాదేవి, ఏపీఓలు వెంకటేష్ నాయక్, శంకర్, ఈసీ సాయిక్రిష్ణ, వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, సర్పంచ్‌లు ఓబిరెడ్డి, నారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'నేల తల్లికి వందనం..'

బత్తలపల్లి: దేశంలోని ప్రతి పౌరుడు నేల తల్లికి వందనం చేస్తూ అమరవీరులను స్మరించుకోవాలని ఎంపీపీ బగ్గిరి త్రివేణి, జెడ్పీటీసీ కోటి సుధ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా నా భూమి–నా దేశం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించుకున్నప్పుడే వాటి ఆవశ్యకత తెలుస్తుందన్నారు. అనంతరం జెండా వందనం చేసి విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. మొక్కలు నాటారు. సర్పంచు అక్కిం కాశమ్మ, ఎంపీటీసీ సభ్యులు కోటి నరేష్, కార్యదర్శి ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

తలుపుల: మండల కేంద్రంలోని కేజీబీవీలో 'నా భూమి, నాదేశం' కార్యక్రమాన్ని సర్పంచ్ శ్రీలత, ఎంపీడీఓ కిరణ్ మోహన్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్‌ఓ మోహనమ్మ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. శిలాఫలకం వద్ద పూజలు చేసి కొబ్బరి కాయలు కొట్టి, మట్టికి వందనం చేసి, దీపారాధన చేశారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ టోపీర మణ, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన అధికారులు

కదిరి అర్బన్: ముత్యాలచెరువు, కేఎస్ పాళెం గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో బుధవారం కార్యక్రమం జరిగింది. మండల స్పెషలాఫీసర్ సుబ్బారావ్, ఎంపీడీఓ అంజనప్ప హాజరయ్యారు. స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలను నెమరు వేసుకున్నారు. మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఈఓ చెన్నక్రిష్ణ, ఏపీఓ శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

- స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో 'మేరీ మట్టి మేరీ దేశ్' కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎంఎస్ ప్రశాంత్ మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్ ప్రసాద్, ఆరిపుల్లా ఉన్నారు.

అమరవీరుల త్యాగం మరువలేనిది

నల్లచెరువు: భారతదేశ స్వాతంత్య్రం కోసం ఎంతో మంది అమర వీరులు ప్రాణత్యాగాలు చేశారని, వారి త్యాగం మరువలేనిదని ఎంపీడీఓ శకుంతల అన్నారు. నల్లచెరువు, ఓరువాయి, తలమర్లవాండ్లపల్లి గ్రామాలలో బుధవారం నాభూమి–నాదేశం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మొక్కలు నాటారు. సర్పంచ్ పంచరత్నమ్మ, ఎంపీటీసీలు లక్ష్మీదేవి, సుమియా తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తి పెంపొందించడానికే..

ఎన్‌పీకుంట: ప్రజల్లో దేశ భక్తి పెంపొందించడానికే కేంద్ర ప్రభుత్వం 'నా మట్టి నా దేశం' కార్యక్రమాన్ని చేపట్టిందని ఎంపీడీఓ ఆదినారాయణ అన్నారు. కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు మండల పరిధిలోని వెలిచలమల, గౌకనపల్లి, మరికొమ్మదిన్నె గ్రామాలలో సచివాలయ సిబ్బంది, మండల అధికారులు నిర్వహించారు. జాతిపిత గాంధీజీ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలను అర్పించిన త్యాగధనులను స్మరించుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేంద్రకుమార్, సర్పంచ్ అంజినమ్మ, ప్రధానోపాధ్యాయురాలు శిరీషారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమడగూరు మండలంలో..

అమడగూరు: శీతిరెడ్డిపల్లి వద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీ, మహమ్మదాబాద్ ఉన్నత పాఠశాలలో కార్యక్రమాన్ని చేపట్టారు. కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ భర్త శివశంకర్‌రెడ్డి, ఎంపీడీఓ మునెప్ప, ఏపీఓ అమరావతి, ఏపీఎం గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నంలో..

పుట్టపర్తి: బుక్కపట్నంలో బుధవారం 'నా భూమి–నాదేశం' కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. బుక్కపట్నం–1,2,3 సచివాలయాలలో వీరులకు వందనం కార్యక్రమంతో పాటు సచివాలయాల ఆవరణంలో మొక్కలు నాటారు. బుచ్చయ్యగారిపల్లి గ్రామానికి చెందిన రిటైర్డు ఆర్మీ అధికారి రాజారెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ నాగలక్ష్మమ్మ, జిల్లా వైఎస్సార్‌సీపీ యూత్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ కరుణాకర్, ఎంపీడీఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బలో..

ముదిగుబ్బ: 'నా భూమి నా దేశం' కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎంపీడీఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుల్లాయప్ప, ఎంపీటీసీ జయాబాయి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



బుక్కపట్నంలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



కనగానపల్లిలో...

స్వాతంత్య్ర సమరయోధుల త్యాగఫలమే స్వేచ్ఛా జీవనం

తాడిమర్రి: స్వాతంత్య్ర సమరయోధుల త్యాగఫలంతోనే స్వేచ్ఛా జీవనం గడుపుతున్నామని డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నా భూమి నా దేశం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలసి ఆయన త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు దేశభక్తి కలిగి ఉండాలన్నారు. నిడిగల్లు, పిన్నదరి, ఏకపాదంపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో కూడా నా భూమి నా దేశం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బండారు బాలమ్మ, వైస్ ఎంపీపీ బీసాలి లింగమ్మ, హెచ్ఎం అరుణ, సచివాలయాల మండల కన్వీనర్ అల్లే సాయినాథ్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆర్వేటి రామాంజినేయులు, నాయకులు జొల్లిరెడ్డి అశ్వర్థ, మల్లప్పగారి మాధవరెడ్డి, మదమంచి మల్లికార్జున నాయుడు తదితరులు పాల్గొన్నారు.

హైరిస్కు గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు

ధర్మవరం రూరల్: దర్శనమల పీహెచ్‌సీలో బుధవారం హైరిస్కు గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలను మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పుష్పలత ఆధ్వర్యంలో నిర్వహించారు. హెచ్‌బీ, బీపీ, బ్లడ్ గ్రూప్, వీడీఆర్ఎల్, హెచ్ఐవీ తదితర పరీక్షలను చేశారు. అవదూత మాదన్న స్వామి ట్రస్టు ఆధ్వర్యంలో గర్భిణులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ కళావతి, ఎంపీహెచ్ఈఓ శివయ్య, సూపర్‌వైజర్లు, ట్రస్టు సభ్యులు చంద్రమోహన్, బాలాజీ, శేషరాజు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

అమడగూరులో..

అమడగూరు: మండల వ్యాప్తంగా ఉన్న గర్భిణులకు వైద్యాధికారులు బుధవారం చికిత్సలు నిర్వహించారు. వైద్యాధికారి మోనా ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కదిరి రోటరీ క్లబ్ వారి ఆధ్వర్యంలో గర్భిణులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

విధిగా పరీక్షలు చేయించుకోవాలి

ఎన్‌పీకుంట: గర్భిణులు నెలవారీ పరీక్షలు విధిగా చేయించుకోవాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ షేక్ ఆసియా తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 45 మందిని పరీక్షించి, 12 మందిని హైరిస్క్ కేసులుగా గుర్తించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నాగలక్ష్మి తదితరులున్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

ధర్మవరం: జిల్లాస్థాయి క్రికెట్ పోటీలకు ధర్మవరం విద్యార్థులు ఎంపికైనట్లు కోచ్ రాజశేఖర్ తెలిపారు. స్థానిక ఆర్డీటీ క్రీడా మైదానంలో బుధవారం క్రీడాకారులకు క్రికెట్ అసోసియేషన్ ధర్మవరం మండల అధ్యక్షుడు వడ్డె బాలాజి, కార్యదర్శి శంకర్‌లు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఇటీవల అనంతపురంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ శిక్షణలో అనుష్క, లిఖిత, మైత్రి ఎంపికయ్యారన్నారు. వెంకటగిరిలో ఇచ్చే శిక్షణకు బయలుదేరి వెళ్లారని తెలిపారు. జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

కుట్టు మిషన్ బంకు దగ్ధం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని పోస్టాఫీస్ కార్యాలయం సమీపంలో కుట్టుమిషన్ ఉన్న బంకును బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. బాధితుడు నబీరసూల్ బోరున విలపించాడు. కుట్టుమిషన్ కూడా కాలిపోయిందని వాపోయాడు.

ద్విచక్ర వాహనం అపహరణ

నల్లచెరువు: మండల కేంద్రంలోని పూలకుంట రోడ్డులో నివాసముండే డి.రవికుమార్ అనే యువకుడి ద్విచక్రవాహనం బుధవారం చోరీకి గురైంది. తన ఇంటివద్ద నిలిపి ఉన్న వాహనాన్ని దొంగిలించారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వరలక్ష్మి తెలిపారు.

భక్తిశ్రద్ధలతో జలధి

అమడగూరు: జేకేపల్లిలో బుధవారం జలధిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వారం రోజులుగా పీర్లస్వాములకు పూజలు చేశారు. చివరిరోజున యువకులంతా తడి బట్టలతో పీర్లస్వాములను ఎత్తుకోవడానికి ఎగబడ్డారు. పీర్లను ఎత్తుకుని ఇంటింటికీ తీసుకెళ్లి చదివింపులు చదివారు. భక్తులు కోర్కెల ప్రకారం మొక్కులు తీర్చుకున్నారు.

వీఆర్‌కు సీఐ కంబగిరి రాముడు!

ముదిగుబ్బ: ముదిగుబ్బ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కంబగిరి రాముడును వీఆర్‌కు పంపినట్లు సమాచారం. సీఐపై పలు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వీఆర్‌కు పంపినట్లు తెలుస్తోంది.

సెల్ టవర్ నిర్మాణానికి భూమిపూజ



సెల్ టవర్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

తలుపుల: పొలతలవాండ్లపల్లి పంచాయతీలోని గ్రామాలలో నెట్‌వర్క్ సౌకర్యం కోసం బీఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటుకు బుధవారం సర్పంచ్ లక్ష్మీదేవి, పెద్దినాయుడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన మాట మేరకు బీఎస్ఎన్ఎల్ సంస్థ సహకారంతో సెల్ టవర్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్నామన్నారు. త్వరగా పూర్తి చేసి నెట్‌వర్క్ సేవలు అందించాలని కాంట్రాక్టర్, అధికారులకు సూచించారు. రెండు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న నెట్ వర్క్ సేవలు అందుబాటులోకి తెస్తున్నందుకు ఆయా గ్రామస్తులు ముఖ్యమంత్రికి, ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రఫినాయక్, సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జి డీకే బాబు, మాజీ ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు షేక్షావలి, రవీంద్రానాయక్, దనుంజయ, శ్రీనివాసులురెడ్డి, ఉత్తమనాయుడు, ప్రభు, జిలాన్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రధాని మోదీని గద్దె దింపుదాం'

పుట్టపర్తి టౌన్: ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న ప్రధాని మోదీని గద్దె దింపుదాం– దేశాన్ని కాపాడుకుందాం అని నినదిస్తూ బుధవారం స్థానిక పోస్టాఫీసు కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈసీ వెంకటేషు, కన్వీనర్ దిల్‌షాద్ మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో కేంద్రప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. లేబర్‌కోడ్ విధానంతో కార్మికులకు తీరని నష్టం కలిగిందన్నారు. గతంలో ఉన్న చట్టాలు యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ సంస్థలు ప్రైవేటీకరణ చేయకుండా పని కల్పించాలన్నారు. కార్మికులకు సాంఘిక భద్రత, పింఛన్, ఉచితంగా వైద్యం సౌకర్యం కల్పించాలన్నారు. ఉపాధి హామీ పనులలో రూ. 600 కూలీ చెల్లించి 200 పనిరోజులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, బాబా, పైపల్లి గంగాద్రి, ఓబుశేసు, శివ, నారాయణస్వామి, సిద్దు, శివ, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



టోర్నీ ప్రారంభిస్తున్న బత్తల వెంకటరమణ

నల్లచెరువు: మండల కేద్రంలోని తాటిచర్ల బ్రదర్స్ మైదానంలో బుధవారం వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నీని వైఎస్సార్ సీపీ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తల వెంకటరమణ ప్రారంభించారు. మొదట స్థానిక బస్టాండ్ సర్కిల్‌లో ఉన్న వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దశరథనాయుడు, శ్రీధర్‌రెడ్డి, హనుమంతురెడ్డి, రామాంజినేయులు, మాజీ ఎంపీటీసి రమణ, రాంకిషోర్ రెడ్డి, దొడ్డెప్ప, కల్లిపల్లి శ్రీనివాసులు, నజీర్ తదితరులున్నారు.

ప్రశాంతంగా జీవించాలి



ప్రజలకు సూచనలిస్తున్న డీఎస్పీ శ్రీలత

తలుపుల: గ్రామీణులు ప్రశాంతంగా జీవించాలని డీఎస్పీ శ్రీలత సూచించారు. తలుపుల పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్ఐ మగ్బుల్‌బాషతో స్థానిక పరిస్థితులపై ఆరా తీశారు. అనంతరం ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు. చికెన్ సెంటర్‌లలో వేస్టును గంజివారిపల్లి రోడ్డు, ఓబీఆర్ రోడ్డు, గండి రోడ్లపైనే వేస్తున్నారని, దీంతో కుక్కల బెడద ఎక్కువైందని పలువురు వాపోయారు. రోడ్ల పక్కన ఉండే చికెన్ పకోడా, తోపుడు బండ్ల నుంచి పొగ, ఘాటుతో కూడిన కారం వస్తుండడంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని కొందరు చెప్పారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని ఎస్ఐను డీఎస్పీ ఆదేశించారు.

విధుల్లో అలసత్వం వీడండి

గాండ్లపెంట: గ్రామ సచివాలయాల్లో పనిచేసే కార్యదర్శులు అలసత్వం వీడాలని ఎంపీపీ తాతం జగన్మోహన్ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ భవనంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌అలీ మాట్లాడుతూ ఎంపీడీఓ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఎంపీపీ మాట్లాడుతూ కొంత మంది కార్యదర్శులు విధులకు హాజరైనట్లు చూపి గైర్హాజరవుతున్నారన్నారు. ఎంఈఓ క్రిష్ణానాయక్ మాట్లాడుతూ ఈ ఏడాదికి సంబంధించి విద్యార్థులకు కిట్లు, రెండవ సెమిస్టర్ పుస్తకాలు సరఫరా చేశారని తెలిపారు. వైస్ ఎంపీపీ గంగోజమ్మ మాట్లాడుతూ కటారుపల్లి గొల్లపల్లి యానిమేటర్ సంఘ సభ్యుల నగదును వాడుకున్నాడని, రికవరీ చేయాలని కోరగా రికవరీ కోసం చర్యలు తీసుకున్నామని ఏపీఎం శారద చెప్పారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రవీంద్రనాయక్, ఎంపీడీఓ యాదవేంద్ర, వైస్ ఎంపీపీ భారతి, ఎంపీటీసీలు ఖమర్‌జహాన్, లక్ష్మీదేవి, సోమశేఖర రెడ్డి, జయక్రిష్ణారెడ్డి, సర్పంచ్‌లు రహంతుల్లా, శాంతమ్మ, శివపప, కోఆప్షన్ సభ్యుడు అమీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజుకు నివాళి

తనకల్లు: సీజీ ప్రాజెక్టు వద్ద గల గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ముండ్లవారిపల్లి సర్పంచ్ రామచంద్రారెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ సుష్మితాజ్యోత్స్న, ఆల్ ఇండియా బంజారా సేవాసంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి 'ఐలు' రాష్ట్ర మహాసభలు

ధర్మవరం అర్బన్: గుంటూరులో ఈనెల 12,13 తేదీలలో జరుగనున్న ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ధర్మవరం బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, ట్రెజరర్ బిల్లే రవి కోరారు. పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో బుధవారం మహాసభల పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు కృష్ణయ్య, కృష్ణమోహన్, కరీం, ఏఐఎల్‌యూ జిల్లా అధ్యక్షుడు వీరుయాదవ్, కార్యదర్శి సతీష్, ఉపాధ్యక్షులు సూర్యచంద్ర, ప్రసాద్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా మహేష్ బాబు పుట్టిన రోజు

ధర్మవరం రూరల్: గొట్లూరు అనాథాశ్రమంలో బుధవారం సినీ హీరో మహేష్ బాబు పుట్టిన రోజు వేడుకలను అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో అభిమానులు బీరే శ్రీరాములు, లింగమయ్య, జిలానిబాషా, మల్లి, మహేష్, బండి రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో..

ధర్మవరం రూరల్: మహేష్ బాబు ఫ్యాన్స్ అధ్యక్షుడు, 25వ వార్డు కౌన్సిలర్ మేడాపురం వెంకటేష్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో అభిమానులు సాయి ప్రకాష్, నరేంద్రబాబు, కాత్యాయని, రజియా తదితరులు పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ తిప్పేనాయక్

ధర్మవరం అర్బన్: ఓటరు రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీఓ తిప్పేనాయక్, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయ సమావేశ భవనంలో బుధవారం పట్టణ, గ్రామీణ బూత్ లెవెల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈనెల 21వ లోపు సర్వే పూర్తి చేయాలన్నారు. ప్రగతి వివరాలు ఇవ్వని సూపర్‌వైజర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశానికి రాని బీఎల్ఓలకు మెమోలు జారీ చేసి సంజాయిషీ కోరాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల తహసీల్దార్ అనిల్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు సర్వే వేగవంతం చేయండి

బత్తలపల్లి: మండలంలో ఓటరు సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని తహసీల్దార్ యుగేశ్వరీదేవి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని 104, 106, 109, 110 పోలింగ్ బూత్‌లలో జరుగుతున్న ఓటర్ లిస్ట్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. బీఎల్ఓలు రానా ప్రతాప్, నరసింహా, రాజా, హరిప్రియ, హాసీన్ బీ, వీఆర్ఓలు రవికాంత్‌రెడ్డి ఉన్నారు.